# మనలాగా ఎందరో!

— ఎన్. రాజేశ్వరి

**"టప్..టప్.." మంటూ చుక్కలు చుక్కలుగా పడుతున్న ప్రతిచోటా గిన్నెలూ, చెంబులూ పెడుతోంది సావిత్రమ్మ. మరి కాస్త ఎక్కువగా పడుతున్న చోట పెద్ద పెద్ద గిన్నెలు, బకెట్లు పెడుతోంది. ఇంచుమించు గది నిండా సామాన్లు పేరుస్తున్నట్టు...గిన్నెల కొలువులా తయారైంది.**

"ఏమిటి సావిత్రీ? సామాన్లు కొలువు తీరుస్తున్నావా? ఇంకొంచెం సేపుంటే, అవి కూడా ఖర్చయి పోతాయి. అలమారాలన్నీ ఖాళీ" నవ్వుతూ మందలించాడు భర్త ఆదినారాయణ.

"ఏం చేయను చెప్పండి? ఇంతకంటే మరో మార్గం ఏముంది? ఈ పెంకులు వేయించే అవకాశం, ఓపికా మనకి లేవు సూర్య చంద్రులే కాక, ఈ వరుణ దేవుడు కూడా మనల్ని వదలడు. ఇలా ఇంటి నిండా సామాన్లు పేర్చుకుంటూ, పూర్తిగా పాడైపోయిన ఈ గచ్చు గదిలో గుంటలు, గోతుల మధ్య ఇంకా ఎన్నేళ్ళు మన బ్రతుకులు ఈడవాలి?" బాధగా నిట్టూర్చింది.

"వానాకాలం కొంత కాలం ఇలాగే వుంటుందిలే! అద్దెకిచ్చిన వాటా బాగుంటే చాలు. లేకపోతే వాళ్ళూ మనలాగా సామాన్లు పేర్చుకుంటూ, ఇబ్బంది పడలేరు కదా? ఖాళీ చేసి వెళ్ళిపోతే...అప్పుడు అద్దె డబ్బులు కూడా లేక నిరాధారమైపోతాం. ఏదో ప్రభుత్వం వాళ్ళు దయదలిచి ఆ పెన్షను ఇస్తున్నారు. దాంతో బాటు ఈ అద్దె వేన్నీళ్ళకు చన్నీళ్ళన్నట్టు గడుపుకొస్తున్నాం. రిటైరయ్యాక వచ్చిన డబ్బుని దాచుకోవడం తెలీలేదు మనకి. మన పిల్లలే కదాని, ఉందే పంచి ఇచ్చేశాం".

"వాళ్ళకాపాటి విశ్వాసం కూడా లేదుగా!" దీనంగా అంది సావిత్రి.

"ఏం చేస్తాం? చెప్పించిన చదువులు మంచి భవిష్యత్తు నిచ్చాయే గానీ, అమాంతంగా వచ్చిన వనితా విత్తాల మైకంలో, మానవత్వాన్ని మరిపింపజేశాయే! అసలా వయస్సే ఒక మయకపు పొర. పోన్లే. మన పిల్లలు సుఖంగా వుండటం కంటే మించిన ఆనందం ఏముంది?" దీర్ఘంగా నిట్టూర్చాడు.

"అంతే లెండి. ఆ తృప్తితోనే శేష జీవితాన్ని గడపటం" అంటూ లేచింది.

"అన్నట్టు ఏవండోయ్! మరింత చీకటి పడిందంటే, ఈ కరెంటు కూడా వుండదో! పొద్దుట చేసిన కూరా, పులుసూ వున్నాయి. కొద్దిగా అన్నం ఒక్కటీ వండితే ఈ మాత్రం వెలుగుండగానే పని పూర్తవుతుంది" అనుకుంటూ స్టౌ వైపు నడిచింది సావిత్రమ్మ.

"అవున్లే. లైటు వెలగకపోతే చీకట్లో గుడ్డి దీపం, కిరసనాయిలు స్టౌ..ఏం వండగలవ్? మీ మొహాలకిది చాల్లే అన్నట్టు కిరోసిన్ స్టౌ వుంచి గ్యాస్ స్టౌ పట్టుకెళ్ళారు కొడుకులు. ఎంత దారుణం?" సణుగుతున్నాడు ఆదినారాయణ.

ఏవేవో గుర్తొస్తుంటే ఆయన మనసు పాడయింది. అక్కణ్ణించి లేచి కాస్త పొడిగా వున్న చోట, వాలుకుర్చీ వేసుకుని నడుం వాల్చాడు.

ఇంటి కప్ప వైపు చూసేసరికి అస్తవ్యస్థంగా వున్న పెంకులు. చిల్లుల్లోంచి, కొంచెం వెలుగు కనపడుతోంది. వర్షం తగ్గుముఖం పట్టేసరికి గండం గడిచినట్టు వూపిరి పీల్చాడు.

"ఏవండోయ్ మొన్న మీరు రాసిన కథకు డబ్బులొచ్చాయా?" భర్త మొహం లోకి చూస్తూ అంది సావిత్రి.

"చాల్లే ఎకెసెక్కెం. అవి తిరిగొస్తున్నాయనే కదా వేళాకోళం!" అన్నాడు. "అయినా మనపై మన పిల్లలకే దయ లేనప్పుడు ఇంకా పత్రికల వాళ్ళకి కూడా వుంటుందంటావా?"అందామె.

"పిల్లల్నెందుకే ఆడిపోసుకోవడం? వాళ్ళ తప్పేం వుంది? చదివిన చదువులకి మంచి అవకాశం వచ్చింది. వెళ్ళారు. అయినా మనల్ని కూడా రమ్మన్నారు కదా! మనమే ఏదో ఆత్మాభిమానమంటూ వెళ్ళలేదు. ఈ వయసులో మనమే సర్దుకుపోవలసింది. పంతానికి పోయాం. అనుభవించాల్సిందే! అయినా వాళ్ళు చిన్నవాళ్ళు. ఎంతో భవిష్యత్తు వున్నవాళ్ళు. అయినా తప్ప మనదే. వాళ్ళు రమ్మన్నా వెళ్ళలేదు మనం" అన్నాడు ఆదినారాయణ.

"అయితే తప్పంతా నాదేనన్నట్టు సాగదీస్తారేమిటి? ఎంత ఆధునికులైతేనేం? సంస్కారం లేనివాళ్ళింటికి ఎలా వెళ్ళాలి. ఇక్కడ చేసింది చాలు. అక్కడ కూడా పని మనిషిలా వూడిగం చేస్తూ పడి వుండటం నావల్ల కాదు. లేవ లేక పోతే క్షీణించి చావనైనా చస్తాను గానీ వాళ్ళ కొంపలకి మాత్రం వెళ్ళను" అంటూ ఛీత్కరించుకుంది సావిత్రమ్మ.

'అవును మరి నిజమే. చదువు నేర్పితే వస్తుంది కానీ, సంస్కారం నేర్పితే రాదు. సంస్కారం కొంత పుట్టుకతో, మరికొంత వారు పెరిగిన తీరు తెన్నులు, చుట్టు ప్రక్కల వాతావరణ ప్రభావంతో వస్తుంది. ఇదంతా సినిమాలూ, టీవీల ప్రభావం. అయినా ఈరోజుల్లో ఆడా, మగా అంతా సమానమే. అటువంటప్పుడు తన వాళ్ళందర్నీ వదులుకొని, ఆడపిల్లలు అత్తవారిళ్ళో అడుగుపెట్టి మనం మనవాళ్ళని వదులుకుంటున్నాం గదా! వాళ్ళూ (భర్తలూ) వాళ్ళ వాళ్ళని వదులుకోవాలీ అన్న విపరీతపుటాలోచనలతో ఉమ్మడి కుటుంబాల్ని విచ్ఛిన్నం చేస్తున్నారు' అనుకున్నాడు ఆదినారాయణ స్వగతంగా.

'ఏమిటండీ దీర్ఘాలోచనలో పడ్డారూ? కథ గురించా కథ లాంటి జీవితం గురించా" సావిత్రమ్మ అడిగింది భర్తని.

"కథలే జీవితాలు. జీవితాలే కథలు. కాకపోతే ఎక్కువ తక్కువల సుఖ దుఃఖాల తేడాలు అంతే!"

"నిజమే ననుకోవండి. కానీ, మనవాళ్ళు మరీ దారుణం. అంతే! అందుకే ఆనాడు ఎంత మొత్తుకున్నా విన్నారు గాదు. తాహతుకి మించి ఇంటినీ, పొలాన్నీ అమ్మి చదివించారు. తీరా ఉద్యోగాలొచ్చి సంపాదిస్తున్నారు గదా! ఇక మన కష్టాలు తీరతాయి గదా! అనుకునే సరికి రెడీమేడ్‌గా పెళ్ళాలొచ్చి ఎగరేసుకుపోయారు. మనకి మాత్రం రిటైర్‌మెంటూ, పాత కొంపా మిగిలింది. పోనీ రిటైర్‌మెంటు తర్వాత వచ్చిన డబ్బైనా మిగిల్చారా? కనీసం ఇంట్లో వున్న ఖరీ



దైన వస్తువులు కూడా మీకివన్నీ ఎందుకంటూ వూడ్చుకుపోయారు. ఇంకా ఈ ఇల్లు కూడా అమ్మి వాళ్ళతో పాటు వచ్చేయమన్నారు. అవును మరి! అక్కడ వాళ్ళకు పనివాళ్ళు దొరకరు కదా! వాళ్ళ పెళ్ళాలకీ, పిల్లలకీ చాకిరీ చేయడానికి మీరూ నేనూ పనికివచ్చి వుండే వాళ్ళం వాళ్ళ మాట వినివుంటే. గొప్పింటి అమ్మాయిలు కోడళ్ళుగా వచ్చారని మురిసి పోయాం. కాని ఇద్దరూ ఇద్దరే! కనీసం మన వయసుకైనా విలువనిచ్చి, మన పెద్దరికాన్నైనా గౌరవించారా? అయినా వాళ్ళ తప్పేముంది లెండి! మన కొడుకులు చవట వెధవల్లా వాళ్ళ కొంగు పట్టుకుని తిరుగుతుంటే మనమేం చేస్తాం? అందుకే నా మనసు విరిగిపోయింది. వాళ్ళకి చాకిరీ చేసి నా శరీరం అలసిపోయింది. విరక్తి పుట్టింది. వాళ్ళేదో మాట వరసకి నన్ను రమ్మన్నారు గానీ మన మీద ప్రేమతో కాదు. ఈ ఇల్లు అమ్మించి ఆ డబ్బులు కూడా దోచుకు పోదామనుకున్నారు. అంతుకే నేను రానన్నాను. పోనీలెండి! వెధవల్ని! ఎంత దూరంగా పోతే అంత మంచిది" అంది సావిత్రమ్మ ఆవేశంగా, బాధగా.

"నిజమే! తల్లి మనసు అంత బాధ పడిం దంటే వాళ్ళెంత కష్టపెట్టి వుంటారో! పోన్లే సావిత్రీ బాధపడకు! నాకు తెలుసు నీ మనోవేదన. మనలాంటి వాళ్ళు కోకొల్లలు. నూటికి, కోటికి ఏ ఒక్కరో అదృష్టవంతులు. ఇంకా మనం ఒక రకంగా అదృష్టవంతులం! ఇంకా ఆడపిల్లలు, చదువు సంధ్యలూ..బాధ్య తలూ లేవు. ఏదో ఓపిక వున్నంత కాలం ఇలా గడుపుదాం. ఈ వున్న కాస్త కొంపా అమ్మి ఏదో ఒక వృద్ధాశ్రమానికి వెడదాం. ఆఖరి రోజుల్లో కొడుకుల దగ్గరికెళ్ళి వాళ్ళ విసుర్లు, ఛీత్కా రాలూ భరిస్తూ వాళ్ళ పంచన పడి వుండటం కంటే అదే మేలు. ఈ రోజుల్లో మన లాంటి వాళ్ళు బోలెడు మంది వున్నారు" అంటూ భార్యని సముదాయించాడు ఆదినారాయణ.

ఖాన వెలిసింది. పైకప్పు చిల్లుల్లోంచి రావాల, వద్దా? అన్న సంశయంతో మసక మస కగా తొంగి చూస్తున్నాడు చంద్రుడు. 'ఈ వృద్ధాప్యం శాపం లాంటిది. అయినా యయాతి అంతటి వాడికే తప్పలేదు. ఇక మనమెంత?' అనుకుంటూ ఆదినారాయణ మేనువాల్చాడు అప్పటికే పరిచిన చాప మీద.

"అవను సావిత్రీ మనం కూడా ఈ ఇల్లు బేరా నికి పెట్టి ఆ డబ్బుతో ఆశ్రమానికి పోదామా?" సాలోచనగా అన్నాడు.

"చాల్లెండి! ఇప్పట్నుంచే ఎందుకు? అక్కడ కూడా మనం అనుకున్నంత గొప్పగా ఏం వుండ దట! మరీ లేవలేనప్పుడు ఆ పని చేద్దాం" అంది.

"అంతే నంటావా? అవున్లే! అవీ దూరపు కొండలేగా!" అనుకుంటూ ఆలోచన్లు కట్టిపెట్టి నిద్రలోకి జారాడు మెల్లగా.

* * *

తెల్లారింది. ఆదినారాయణ నిద్ర లేచాడు. భార్య ఇంకా నిద్రపోతూ కన్పించింది. 'ఎప్పుడూ పెందలాడ లేచి పనులు చేసుకునే సావిత్రి ఇంకా లేవలేదేమిటబ్బా?' అనుకుంటూ "సావిత్రీ! సావిత్రీ" అంటూ పిలుస్తూ ఆవిడ్ని కుదిపాడు. ఆవిడ శరీరం చల్లగా తగిలింది. గుండె ఝల్లుమంది. డాక్టరును పిలిపిస్తే ఆవిడ పోయి అరగంటపైనే అయ్యిందని, గుండెపోటుతో మరణించిందని నిర్ధారించాడు.

ఆమె ఇక లేదన్న నిజాన్ని జీర్ణించుకోలేక ఆదినారాయణ భోరున విలపిస్తున్నాడు. "నన్ను ఒంటరి వాణ్ణి చేసి వెళ్ళి పోయావా సావిత్రీ?" అంటూ రోదిస్తున్నాడు.

ఆయన రోదనలు విన్న వీధిలోని వారంతా పోగయ్యారు. అద్దె పోర్షన్‌లో వుంటున్న రామా రావు గారు ఆదినారాయణ్ణియ్యణ్ణి ఓదారుస్తు న్నారు.ఆదినారాయణ కొడుకులకు ఈ విష యాన్ని ఫోన్‌చేసి చెప్పమని వాళ్ళబ్బాయికి పుర మాయించారు.